క్లుప్తంగా

విద్యుత్ కనెక్షన్లు నేరుగా పొందాలి

అచ్చంపేట రూరల్: కొత్తగా విద్యుత్ కనెక్షన్లు పొందే వినియోగదారులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా సబ్ డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సేవా కేంద్రంలో డీడీ, దరఖాస్తును అందజేయాలని ఏఈ అంజనేయులు గురువారం ప్రకటనలో కోరారు. ఆన్‌లైన్ ద్వారా సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కొత్త విద్యుత్ కనెక్షన్ కోసం ఎవరైనా డబ్బులు అడిగినట్లయితే రాత పూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముగిసిన అయ్యప్ప పడిపూజలు

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట అయ్యప్ప స్వామి దేవాలయ ఆవరణలో మూడు రోజులుగా నిర్వహించిన అయ్యప్ప పడిపూజలు గురువారం హోమాహుతి కార్యక్రమంతో ముగిశాయి. పూజారి అనురూప్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిఖరావిష్కరణ, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కల్వకుర్తిరూరల్: యువకులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పంజుగుల గ్రామంలో పంజుగుల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అనిల్‌గౌడ్, భూపతి రాజు, హసన్, సభ్యులు పాల్గొన్నారు.

కూలీలను ఇతర గ్రామాలకు తరలిస్తే చర్యలు

కోడేరు: కూలీలను ఇతర గ్రామాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఆటోలు, బొలెరో వాహనాల్లో కూలీలను తరలిస్తున్న యజమానులను పట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ కూలీలను వివిధ పనుల కోసం ఇతర గ్రామాలకు తీసుకెళ్లడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించి కూలీలను ఆటోలు, ఇతర వాహనాల్లో తరలించరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

వెల్దండ: సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని ఏఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని అల్లంతోటబావితండాలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటన స్పందించాలన్నారు. అతని గ్రామం, పేరు, అడ్రస్‌లను అడిగి తెలుసుకోవాలన్నారు. ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫోన్ ద్వారా బ్యాంక్‌ఖాతా, ఆధార్ నంబర్ తెలపాలని కోరితే స్పందించరాదన్నారు. వేసవి కావడంతో దొంగలు సంచరిస్తారని, మహిళలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చారకొండ: మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయసుధ గురువారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అచ్చంపేట్, కల్వకుర్తి ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, ఎంపీ రాములు హాజరు అవుతున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కరుణశ్రీ గురువారం ప్రకటనలో తెలిపారు.

రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా రమాకాంత్

అచ్చంపేట రూరల్: మేదర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పట్టణానికి చెందిన రమాకాంత్‌ను ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో సంఘం రాష్ట్ర స్థాయి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికైన రమాకాంత్‌ను పట్టణానికి చెందిన నాయకులు అభినందించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

వెల్దండ: మండలంలోని కొట్రగేట్ సమీపంలో దొంగరోడ్డు వద్ద గురువారం ట్రాక్టర్, బైక్ ఢీ కొనడంతో తుమ్మలకుంటతాండకు చెందిన రామావత్ చందులాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేస్లీతండా పంచాయతీలోని తుమ్మలకుంటతండాకు చెందిన చందులాల్ నాయక్ కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్నాడు. తండా నుంచి కల్వకుర్తి వైపు బైక్‌పై వెళ్తున్న చందులాల్‌నాయక్ ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదు తరలించారు. తల్లి సాలియా ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ గోర్లట్ల మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

పాడి రైతులకు అందని ప్రోత్సాహకం

జిల్లా వ్యాప్తంగా రూ.17కోట్ల బకాయిలు



కల్వకుర్తి పాలశీతలీకరణ కేంద్రం

కల్వకుర్తిరూరల్: జిల్లాలో వ్యవసాయంలో నష్టాలు వస్తుండడంతో చాలా మంది పాడిపరిశ్రమను జీవనోపాధిగా ఎంచుకున్నారు. పంటలు పండుతున్నా ఆశించినంత దిగుబడి, గిట్టుబాటు ధరలు వస్తాయనే నమ్మకం లేకుండా పోయింది. దీంతో గేదెలు, ఆవులు కొనుగోలు చేసి వాటి పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. జిల్లాలో ప్రైవేట్ డెయిరీలు చాలా ఉన్నప్పటికీ ఎక్కువ మంది ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు.

జిల్లాలో పాలశీతలీకరణ కేంద్రాలు

జిల్లాలో అచ్చంపేట, కల్వకుర్తి పట్టణాలలో పాలశీతలీకరణ కేంద్రాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 7 బీఎంసీయూలు ఉన్నాయి. 211 పాలశీతలీకరణ కేంద్రాలు ఉండగా 7,700 మంది పాడి రైతులు విజయ డెయిరీకి పాలు పోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజు 50వేల లీటర్ల పాలు సేకరిస్తున్నారు. ఇటీవల పాడి రైతులకు పాల దిగుబడి పెంచుకునేలా చేయడంలో శిక్షణ ఇచ్చారు.

37 నెలలుగా అందని డబ్బులు

ప్రభుత్వం ప్రకటించిన లీటర్‌కు రూ.4 ప్రోత్సాహకం 37 నెలలుగా పాడిరైతులకు అందడం లేదు. 2020 ఏప్రిల్ నుంచి 2023 మే వరకు రూ.17 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. డబ్బులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి



విజయ డెయిరీకి 2004 నుంచి ప్రతి రోజు 30 లీటర్ల పాలు పోస్తున్నా. 37 నెలలుగా రూ.4 ప్రోత్సాహకం రావడం లేదు. సబ్సిడీ దాణా నాసిరకంగా ఉంటుంది. ప్రోత్సాహకం డబ్బులను విడుదల చేసి పాడి రైతులకు చేయూతనందించాలి.
– శ్రీనివాస్‌రెడ్డి, కల్వకుర్తి

త్వరలోనే విడుదల..



రూ.4 ప్రోత్సాహకంపై ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రతి నెల లెక్కను పంపిస్తాం. ముందుగా రైతుల ఖాతాల్లోకి నిధులు జమ అవుతాయి. నెల రోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.
– సత్యనారాయణ, జిల్లా డైరెక్టర్ పాడిపరిశ్రమ శాఖ, నాగర్‌కర్నూల్

వరి కొనుగోలు వేగవంతం చేయాలి


కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

తెలకపల్లి: వరి కొనుగోళ్లను వేగవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గడ్డంపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని కమిటీ సభ్యులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరి ధాన్యంలో తాలు ఉన్నాయని, తేమ పేరుతో కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేయడం లేదని తెలిపారు. కాంటాలు వేసిన దగ్గర కూడా 40 కిలోల సంచికి 3-4 కిలోల తరుగు తీస్తున్నారని అన్నారు. గడ్డంపల్లిలో దాదాపుగా వంద మంది రైతులు 20 రోజుల వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినా కొనుగోలు చేయడం లేదని వారు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్దకు లారీలు వెళ్లడానికి మార్గం లేదనే సాకుతో కాంటాలు చేయడం లేదని, కాంటా వేసిన ధాన్యం సంచులు కూడా కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయన్నారు. తక్షణమే పరిష్కారం చూపి వడ్లు కొనుగోలు చేసి తరుగు తీయకుండా మిల్లర్లకు ఖచ్చితమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, గోపస్ లక్ష్మణ్, బాబు, అలివేల, శేఖర్, నిరంజన్, బుచ్చమ్మ, మిద్దె బాబు, రాములు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు


కల్ములోనిపల్లిలో ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న అధికారులు

అమ్రాబాద్: మండలంలోని కల్ములోనిపల్లి, జంగంరెడ్డిపల్లిలో గురువారం అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించారు. వీధుల, మురుగు కాల్వలు, నర్సరీలతో పాటు ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఎంపీడీఓ రామ్మోహన్ మాట్లాడుతూ 23వ తేదీ వరకు గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓ వెంకటయ్య, సర్పంచ్ లక్ష్మమ్మ, కార్యదర్శులు రాజారాంనాయక్, నాగేష్ తదితరులు ఉన్నారు.

ఎంపీ పదవి నుంచి తొలగించాలి


రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళా రెజ్లర్లపై లైంగికదాడికి పాల్పడుతున్న ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటియూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నాగనూల్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా ఢిల్లీ జంతర్‌మంతర్‌లో మహిళా రెజ్లర్లు తమపై బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ధర్నా నిర్వహిస్తున్నా ప్రధాని మాత్రం కనీసం మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. వారు తీసుకువచ్చిన పతకాలు మాత్రం ప్రభుత్వానికి అవసరమని, అప్పుడు వారిని పిలిచి సన్మానం చేశారన్నారు. అన్యాయం జరిగిందని ధర్నాలు చేస్తున్నా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ హయాంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఎంపీలు పార్లమెంట్‌లో ఉంటే దేశ గౌరవమే దిగజారుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, అశోక్, ఉస్సేన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్‌ట్యాంకు



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పెద్ద ముద్దునూరులో తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పాత పంచాయతీ సమీపంలో 20వేల లీటర్ల సామర్థ్యంతో 30 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంక్ ప్రస్తుతం ఇనుప చువ్వలు తేలి పెచ్చులూడి పడుతున్నాయి. ఫలితంగా ట్యాంకు చుట్టూరా ఉన్న నివాసాల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకు పిల్లర్లు కూడా దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకును కూల్చి కొత్తది నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు.

కాలుష్య నివారణకు కృషి చేయాలి


మాట్లాడుతున్న సామ్య నాయక్

పెద్దకొత్తపల్లి: కాలుష్య నివారణ కోసం కృషి చేయాలని బీడీఎస్ చైర్మన్ సామ్యానాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో జీకెఎఫ్ టీఎం టెక్ సంస్థ, కార్బన్ క్రెడిట్ సంస్థల ఆధ్వర్యంలో సమావేశంలో రైతులతో మాట్లాడారు. వాతావరణంలోని కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కాలుష్యాన్ని నివారించడానికి ఉచిత కార్బన్ క్రెడిట్ నగదు రూపంలో సహాయపడుతుందని తెలిపారు. గ్రామాలలో సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి 5 మొక్కలు నాటే విధంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యం, రమేష్‌నాయక్, నరేష్ రాథోడ్, శ్రీనివాస్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేనా..?


వెల్దండ జెడ్పీహెచ్ఎస్‌లో అసంపూర్తిగా ఉన్న భోజనశాల

- అసంపూర్తిగా మన ఊరు–మన బడి పనులు
- నెలలు గడుస్తున్నా సాగని వైనం

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా మెరుగైన విద్యను అందించటంతో పాటుగా వసతులను మెరుగుపరిచే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగానే మండలంలో మొదటి విడతలో 20 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటశాలలు, అదనపు తరగతి గదులు, ప్రహరీ గోడలు, మూత్రశాలలు తదితర వాటిని నిర్మించడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఆయా పాఠశాలల్లో పనులను ప్రారంభించి నెలలు గడుస్తున్నా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. గత విద్యా సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉన్నా ఇంకా పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పటంలేదు. ప్రారంభించిన పనులు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పూర్తి అయ్యేలా కనిపించటం లేదు.


గుండాలలో అసంపూర్తిగా ప్రహరీ

20పాఠశాలలకు రూ.1.93కోట్లు మంజూరు

మండలంలోని 45ప్రాథమిక పాఠశాలలు, 5 ప్రాథమికోన్నత పాఠశాలలు, 7 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 57 పాఠశాలల్లో మొదటి విడతలో 20 పాఠశాలలను మన ఊరు- మన బడి పథకంలో ఎంపిక చేశారు. పనులను చేసేందుకు కాంట్రాక్టర్లు దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు రూ.25లక్షల నిధులను మంజూరు చేశారు. ఇందులో భోజనశాలకు రూ.15.79లక్షలు, తాగునీటికోసం రూ.1.9లక్షలు, విద్యుత్ సౌకర్యం కోసం రూ.2.6లక్షలు, మరమ్మతు కోసం రూ.6.12లక్షల చొప్పును కేటాయించారు. ఇందులో పనులు అసంపూర్తగానే ఉన్నాయి. అదేవిధంగా ఎమ్మార్సీ పాఠశాలకు రూ.7.51లక్షలు, బాలికల పాఠశాలకు రూ.7.61లక్షలు, బొల్లంపల్లికి రూ.11.57లక్షలు, చెర్కూర్‌కు రూ.6.27లక్షలు, దేసిగానితండాకు రూ.5.23లక్షలు, గొల్లోనిపల్లికి రూ.6.56లక్షలు, గుండాలకు రూ.5.3లక్షలు, కొట్రకు రూ.16.9లక్షలు, ఎంజీ తండాకు రూ.4.8లక్షలు, మర్రిగుంత తండాకు రూ.5.10లక్షలు, పెద్దాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.5.34లక్షలు, పోతేపల్లికి రూ.8.81లక్షలు, రాచూర్ పాఠశాలకు రూ.7.91లక్షలు, రాఘయపల్లికి రూ.6.8లక్షలు, తిమ్మినోనిపల్లి రూ.5.97లక్షలు, ఉబ్బలగట్టుతండాకు రూ.6.71లక్షలు, అజిలాపూర్‌కు రూ.18.84లక్షలు, కుప్పగండ్లకు రూ.8.29లక్షలు, పెద్దాపూర్ ఉన్నత పాఠశాలకు రూ.25.25లక్షలు చొప్పున మొత్తం రూ.కోటి93లక్షల43వేల నిధులు మంజూరైనట్లు అధికారులు వివరించారు. ఇందులో సగం కంటే తక్కువ పనులు కావడంతో మిగిలిన పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కాంట్రాక్టర్ల ఆలస్యం



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుంది. మన ఊరు–మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో 20పాఠశాలల్లో పనులు చేసేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ల వల్ల ఆలస్యమవుతుంది. పాఠశాలలు పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేసేందుకు కృషి పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు.
– శంకర్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎంఈఓ, వెల్దండ

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పథకాలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కోడేరు: బీఆర్‌ఎస్‌తోనే పలు సంక్షేమ పథకాలు అమలయ్యాయని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. స్థానిక బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనుల కోసం రూ.25కోట్ల 31లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, కొన్ని పనులు పూర్తి కావచ్చాయని, మరికొన్ని ప్రగతిలో ఉన్నాయన్నారు. గ్రామాల్లో ఎక్కడా మట్టి రోడ్లు కనిపించకుండా సీసీరోడ్ల కోసం రూ.2కోట్ల65లక్షలు ఖర్చు చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీడు భూములుగా ఉన్న భూములు నేడు పచ్చదనంగా మారాయంటే అందుకు సీఎం కేసీఆరే కారణమన్నారు. పస్పుల గ్రామానికి చెందిన రైతులకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే తన సొంత ఖర్చులతో 500 ఎకరాలకు మినీ లిఫ్టును ఏర్పాటు చేసి సాగునీరు అందించానని తెలిపారు. మాచుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, నాగులపల్లి, బావాయిపల్లిలో కొత్త బ్రిడ్జిలను మంజూరు చేశామన్నారు. సోమశిల సిద్దేశ్వరం జాతీయ రహదారిని సాధించుకున్నామని, రైతుల శ్రేయస్సు కోసం చివరి ఆయకట్టుకు నీరు అందించడమే లక్ష్యంగా సింగోటం, గోపల్‌దిన్నె లింక్ కెనాల్ మంజూరు చేశామన్నారు. మండలంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, రాజశేఖర్‌గౌడ్, రఘువర్ధన్ రెడ్డి, సోమనాథ్‌నాయక్, జగన్మోహన్‌రెడ్డి, చిన్నా రెడ్డి, సర్పంచ్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ధ్యానంతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం


అవగాహన కల్పిస్తున్న ఆంజనేయరెడ్డి

పెద్దకొత్తపల్లి: ధ్యానంతో దీర్ఘకాలిక వ్యాధులు సైతం దూరమవుతాయని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి అన్నారు. గురువారం నారాయణపల్లిలో ధ్యాన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గుండె జబ్బులు, బీపీ, షుగర్ లాంటి ప్రమాదకరమైన జబ్బులు కూడా తగ్గుతాయని తెలిపారు. నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక ఒత్తిడిల నుంచి బయట పడవచ్చని వివరించారు. డిప్రెషన్ నుంచి బయటపడవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, లలిత, అనిత, స్వప్న, శైలజ తదితరులు పాల్గొన్నారు.

తేమశాతం సక్రమంగా ఉంటేనే మద్దతు ధర


లింగాల కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఓ

లింగాల: వరి ధాన్యంలో ప్రభుత్వం విధించిన తేమ శాతం ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని ఏఓ నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆవరణలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏఓ పరిశీలించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసినా, చేయాల్సిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని కల్లాలోనే ఆరబెట్టి కేంద్రానికి తీసుకువాలని రైతులను సూచించారు. వరిలో తేమ శాతం 14 ఉండాలని, తాలు, చెత్త లేకుండా తీసుక వస్తే మొదటి రకం ధాన్యానికి మద్దతు ధర రూ.2,060, రెండవ రకానికి రూ.2,040 వస్తుందని తెలిపారు.

మాయమాటలు నమ్మి మోసపోకండి


చెన్నంపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న వంశీకృష్ణ

లింగాల: ముఖ్యమంత్రి కేసీఆర్ మాయమాటలు నమ్మి మరోసారి మోసపోకండని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ప్రజలను కోరారు. గురువారం మండలంలోని శ్రీరంగాపూర్, చెన్నంపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను కొనసాగించారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ పార్టీని ఆదరించాలని ప్రజలను కోరారు. త్వరలో ఎన్నికలు వస్తుండడంతో బీఆర్‌ఎస్‌కు భయం పుట్టుకుందని, రాష్ట్రంలో కూడా కర్ణాటక ఫలితాలు వస్తే ఎలాగని ఆందోళనలో పడ్డారని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి తీరుతామని తెలిపారు. చెన్నంపల్లిలో నేటికి పూరి గుడిసెలు దర్శనమిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ రాథోడ్, లక్ష్మణ్‌నాయక్, రాంజీనాయక్, విజయలక్ష్మి, భాగ్యబాయి, ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

అచ్చంపేట రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఐనోల్ చెందిన 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీ కమిటీ ఏకగ్రీవం

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో డీసీసీ కార్యదర్శి కోరె రేణయ్య, బొంత జగన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా బొంత బాలకిష్టయ్య, ప్రధాన కార్యదర్శి సోట ముత్యాలు, సభ్యులుగా పలువురిని ఎంపిక చేశారు.

క్రీడాపోటీలు ప్రారంభం



చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీడీఓ జయసుధ, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఆయా గ్రామాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేష్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

జెన్‌కో ఆర్టిజన్ల శ్రమదానం

దోమలపెంట (అచ్చంపేట): ఇటీవల కురిసిన వర్షాలకు శ్రీశైలం ఆనకట్ట ఘాట్ రోడ్డులో ఇసుక మేటలు పేరుకున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు తరుచూ రోడ్డు ప్రమాదానికి గురవుతున్నారు. గమనించిన భూగర్భ కేంద్రం సివిల్ ఎస్ఈ రవీంద్రకుమార్, ఈఈ రవీంద్ర, ఏఈ. నాగరాజు ఆ ప్రాంతాన్ని పరిశీలించి గురువారం సివిల్ డివిజన్‌కు చెందిన ఆర్టిజన్లతో శ్రమదానం చేయించి ఇసుక మేటలను తొలిగించారు.



ఆహార పంటలు సాగు చేసుకోండి


రైతులకు సూచనలు ఇస్తున్న సంస్థ నిర్వాహకులు

మన్ననూర్: ప్రస్తుత పరిస్థితుల్లో వాణిజ్య పంటలు కాకుండా ఆహార పంటలు సాగు చేసుకోవాలని కోనేరు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ఇస్మాయిల్, పెద్దులయ్య, లింగేశ్వర్ రైతులకు సూచించారు. గురువారం అమ్రాబాద్ మండలంలోని చౌటగడ్డలో రైతులు, గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి వ్యవసాయ సలహాలు, సూచనలు తెలియజేశారు. ఈ ప్రాంతంలో పంట మార్పిడి వ్యవసాయం చేయకపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. అందుకోసం మరి కొంతకాలం వాణిజ్య పంటలు కాకుండా ఆహార పంటలు రాగులు, జొన్నలు, సజ్జలు, కందులు, చిరుధాన్యాలు సాగు చేసుకోవాలని తెలిపారు. వేసవి దుక్కులు, భూమి సాగుకు సంబంధించిన యాజమాన్య పద్ధతులు తప్పకుండా పాటించాలని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు సంస్థ ద్వారా ఉచితంగా అందజేస్తామని తెలియజేశారు. అదేవిధంగా ఇంటి ఆవరణలో పెరటి తోటలు సాగు చేసుకోవాలని సూచించారు. దివాకర్, రామస్వామి, లింగయ్య, పెద్దులమ్మ, ఎల్లయ్య, పార్వతమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ అందజేత

వెల్దండ: మండలంలోని కొట్రకు చెందిన రమేష్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన రూ.2.50లక్షల ఎల్‌ఓసీ గురువారం ఎంపీ రాములు హైదరాబాదులో ఆయన నివాసంలో అందజేశారు.

కోడేరు: మండలంలోని పస్పులకు చెందిన నాగమణి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని చికిత్స పొందుతుండటంతో మెరుగైన చికిత్స కోసం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ.2.50లక్షల ఎల్‌ఓసీని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మొక్కలపై ప్రత్యేక దృష్టి

వెల్దండ: నర్సరీలల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బొల్లంపల్లి, పోతేపల్లిలో నర్సరీలను ఎంపీడీఓ పరిశీలించారు. వేసవి కావడంతో ఎండతీవ్రతను తట్టుకునే విదంగా గ్రీన్ నెట్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలంలో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు.

కల్వకుర్తిరూరల్: ఉపాధి హామీ పనుల రికార్డులను ఎంపీడీఓ ఆంజనేయులు గురువా రం ఉపాధి హామీ కార్యాలయంలో పరిశీలించారు.